# యువశక్తి

## అట్టాడ అప్పల్నాయుడు

"...నమస్కారం సార్..."

ఉదయం పదిన్నర గంటల వేళ. ఏప్రిల్ మాసాంతపు ఎండ- వడ్డీతో రీషెడ్యూలయిన- అప్పులా మండిపోతోంది. గ్రామీణ వికాస్ బ్యాంక్ నిండుగా జనం! యధాప్రకారం కరెంట్ కట్...!

ఇక, చెమటలు కారినా, చొక్కాలు తడిసినా- కస్టమర్లు వొదలరు, కరెంట్ వొచ్చేదాక, తప్పదీ బాధ అని గుణుసుకుంటూ, కంఠం దిగువ చొక్కా గుండీనొకదాన్ని విప్పి- నమస్కరించిన వ్యక్తి వేపు చూసేరు ఫీల్డాఫీసర్.

నమస్కరించిన వ్యక్తి- చిన్నగా నవ్వేడు, మళ్లీ చేతులు జోడించి! బదులుగా- నవ్వునో, నమస్కారాన్నో రివర్స్ ఎంట్రీ వెయ్యాలా, వొద్దా- సంశయంలో- ఫీల్డాఫీసర్.

"... కరెంట్ పోయిందేటి సార్...?" నవ్వుతూ ప్రశ్నించేడు నమస్కరించిన వ్యక్తి. ఫీల్డాఫీసర్‌కి- చిరాకు తన్నుకొచ్చింది, ఉక్కబోతలా.

"... జెనరేటర్ కొనొచ్చుగదా సార్..." మళ్లీ అతడే నవ్వుతూ, కరెంట్ కొనొచ్చుగదా- అనే ప్రతిపక్ష నేతలా!

ఇంతకీ- యితనెవరు?

మానవులను- మనం ఖాతాదార్లుగా మాత్రమే గుర్తించుదుము; రాజకీయనేతలు- ఓటర్లుగా గుర్తించినట్లు! ఖాతాదారుడు కానివాడు- మానవుడు కానట్లేనని, యిందుమూలంగా గ్రహించవలెను.

ఖాతాదారులను- రెండు కేటగిరీలుగా విభజించుదుము. డిపోజిటర్, బారోవర్...! అంతియే! అందులో- యితనే కేటగిరీ..?

ఫీల్డాఫీసర్ తర్జనభర్జనలో...

"...నేను సార్... రాజీవ్ యువశక్తి పథకం క్రింద లోన్‌కోసం..." ఆ యువకుడు పూర్తి చేయనేలేదు, ఫీల్డాఫీసర్ రిలాక్సయిపోయేరు.

డిపోజిటర్ కేటగిరీ వారయినచో- చీకూ, చింతా వగైరాలన్ని మనసులో దాచుకొని- రాని చిరుదరహాసమును ముఖాన అతికించుకొని- అతగాని సవ్య, అపసవ్య సందేహములన్నీ తీర్చవలెను. గానీ, ఋణముకోసం వొచ్చే బారోవర్ కేటగిరీ వాడితో- యీ నటన అవసరం లేదు. మనయొక్క ఒరిజినాల్టీ ప్రదర్శించవచ్చు; ఒకింత దర్పం గూడా జోడించవచ్చు! దేశ దేశాల ప్రధానుల ముందర- ప్రపంచబ్యాంక్ అధికార్ల దర్పాన్ని- మనం గుర్తుకు తెచ్చుకోవచ్చు.

ప్చ్. గానీ, యిటీవల మేనేజిమెంట్- యిదంత మంచిది కాదంటోంది. కాంపిటీషన్ పెరిగింది గదా- సెల్‌ఫోన్లకి మెసేజ్‌లిచ్చి, లోనింగ్ వలలు (Net-loaning) వేస్తున్నాయిగదా బ్యాంకులు! అంచేత జాగ్రత్త సుమా- అంటోంది మేనేజిమెంట్.

అంటే- దర్పం తగ్గించమనే తప్పా- అసలు దర్పమే వుండరాదని కాదు గదా?

అయినా- గవర్నమెంట్ సబ్సిడీ స్కీము ఋణాలకు మనమే గతి! పోటీపడే- ప్రైవేట్ బ్యాంకులు- యీ ఋణాలివ్వవు. గనక, దర్పాన్ని లేశమాత్రం తగ్గించాల్సిన అవసరంలేదు! పాతబాకీ గల దేశాల ముందర ప్రపంచబ్యాంక్ అధికార్లలా దర్పం ప్రదర్శించొచ్చు- అని, తీర్మానించుకొని, కాళ్లు బార్లా చాపి, కళ్లతో ప్రశ్న విసిరేరు ఫీల్డాఫీసర్.

"... లిస్ట్ వొచ్చిందేమోనని.." ఆ యువకుడు చొక్కా మరో గుండీ విప్పి- టేబుల్‌మీది లెడ్జర్ మీదకి దృష్టి విసిరేరు ఫీల్డాఫీసర్- ఆ జవాబు విననట్టు.

కాసేపు ఆ యువకుడు- మౌనంగా- గుడిలో విగ్రహం ముందర నిల్చున్నట్టు నిల్చున్నాడు.


"... లిస్ట్ రాలేదు..." విగ్రహం పలికింది.

"..."

కథ



**"...యేఁవో! మీరు మళ్లా యిస్తే ఫరవాలేదు. శనోరంనాడు వొంటిపూట బేంకు- అవదనీ; సోమవోరం బిజీ అనీ, మంగ్లోరం- ట్రెయినింగని, బుధవోరం- బేంకీ రోజు కాదనీ- యిలాగ తిప్పేసినారనుకోండి- నా బతుకు కల్లమైపోతాది! ప్రైవేట్ అప్పుచేసి- మీకు చెల్లిస్తాను. ఆ ప్రెయివేటోడు- వారపు వడ్డీ లాగేస్తాడు. మీ బ్యాంకిచ్చిన వడ్డీ రాయితీ- ఆడి గుండంలోన కల్సిపోద్ది! అవతల ఆడివడ్డీ, యివతల మీ వడ్డీ- గూబ గుయ్యిఁవనిపోద్ది నాకు..." అని వివరణ యిచ్చుకున్నాడు రైతు.**



"... వెళ్లి, మండలాఫీస్‌లోనో? సెట్‌శ్రీ (SETSRI) ఆఫీస్‌లోనో కనుక్కో..." కసురుకుంది విగ్రహం.

"వాళ్లని కనుక్కున్నాను. తాంబూళాలిచ్చేసాను- తన్నుకు చావండని అగ్నిహోత్రావధాన్లన్నట్టున్నారు వాళ్లు..." నవ్వుతూ, చెప్పాడా యువకుడు.

ఫీల్డాఫీసరికి ఆశ్చర్యం వేసింది. రాజీవ్ యువశక్తి వంటి పథకాలకు- ఇంటర్, ఐ.టి.ఐ., టెన్త్‌క్లాస్ విద్యార్హతల వాళ్లు దరఖాస్తులు చేస్తారు! వారికి- సమాజమూ, సాహిత్యం- యేం తెలిసి ఛస్తుందని- ఫీల్డాఫీసర్ భావన. దానికి తగ్గట్టు, అతని ఖాతాదార్లు యెక్కువ మంది- "మాకవన్నేటి తెలస్తాయి బావూ, మాకేటి సదువా, సంగీతఁవా?- అనేవాళ్లే!

అంచేత, ఆశ్చర్యంగా చూస్తూ-

"యేం చదువుకున్నావ్?" అనడిగేరు ఫీల్డాఫీసర్.

"... పనికిరాని చదువు..."

"... అది కాదోయ్- కన్యాశుల్కం డైలాగ్ చెప్పావు గదా-"

"... అదా! మీలాంటోళ్లకర్థమవుతుందని- ఆ డైలాగన్నాను. అదే, మా విలేజ్‌వోళ్లకయితే- ఆకులిచ్చేసేను, అడుక్కుతిని సావండని సర్పంచ్ గారన్నట్టు అనేవాడ్ని..." అన్నాడావ్యక్తి.

ఫీల్డాఫీసర్‌గారికి- ఆ వ్యక్తిపట్ల ఆసక్తి కలిగింది.

నవ్వుతూ బదులిచ్చాడేగానీ, ఆ యువకుని అంతరంగంలో సర్పంచ్ కదిలేడు. సర్పంచ్ యిచ్చిన ఆకులు- నిజానికి అడుక్కుతినడానికే...! అవి విస్తర్లు కావు- వడ్డించిన విస్తర్లు- అసలుకావు!

ఇందెరమ్మ ఇళ్లూ, వృద్ధాప్య పెన్షన్లూ, తెల్లకార్డులూ, సబ్సిడీ ఋణాలూ- వాగ్దానాలు ఓడినవాడూ- అవే వాగ్దానాలు చేసాడు- గానీ యీయనెలా గెలిచాడు?

పార్టీ అండ! అంతకుమించి, మంత్రిగారి మద్దతు! మనోడుకి- మంత్రి దగ్గర పలుకుబడుంది- ఊరికి, యేదేనా చేసెస్తాడు- ఊరిని యిలాగుంచడు- జనవాక్కు!

జనవాక్కుని నిజం చెయ్యడానికి సర్పంచ్- కంకణం కోసం వేదికేడు కట్టుకోడానికి!

ఇందిరమ్మ ఇళ్లు- లబ్ధిదార్ల ఎంపిక!

"... ఓటెయ్యడంకి రమ్మంటే వొచ్చేంగాని, ఇల్లు గట్టి యిక్కడ వుండిపోడంకి- యేటుంది ఉపాధి మాకు?" వలసపోయిన కుటుంబాలన్నాయి. కంకణం- జారినట్లైంది సర్పంచ్‌కి.

పెన్షన్‌దార్ల ఎంపిక!

"... నీ దయ! కాలూ చెయ్యి ఆడదు, కళ్లు కనబడవు- వొలస పోయినోళ్లతోటి పోలేం. ఇక్కడ, గెంజినీళ్లకి గతిలేక సావలేం. నీ దయ..." అన్నారు వృద్ధులు! సర్పంచ్‌కి- కంకణం చుట్టుకుంటోంది. రేషన్‌కార్డులూ, సబ్సిడీ స్కీములూ, రోడ్లూ, వీధిదీపాలు- బడ్జెట్ లెఖ వేసాడు. ఎక్కువే కన్పించింది. తృప్తిపడ్డాడు సర్పంచ్. కంకణాన్ని మురిపెంగా చూసుకున్నాడు.

"...యువశక్తే- దేశభవిష్యత్! ఉపాధిలేని యువకులు- స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తు పెట్టుకోండి. ఋణాలిప్పిస్తాను..." అని, కంకణం సాక్షిగా, చెప్పేడు సర్పంచ్.

రాజీవ్ యువశక్తి పథకం క్రింద ఋణం కోసం దరఖాస్తు చేసారు యువకులు!

"మీ ఊర్లో చాలామంది దరఖాస్తులిచ్చినట్లుందే?" అడిగింది విగ్రహం.

"... చాలామంది యెక్కడున్నార్సార్?" డబ్బున్నోళ్ల పిల్లలు పెద్ద చదువులు చదివి- పెద్ద ఉద్యోగాలు సంపాదించి- పెద్ద పెద్ద నగరాలకెళిపోయేరు ఊరొదిలేసి. డబ్బు లేనోళ్ల పిల్లలు, చదువులేక, యిక్కడ పని దొరక్కా, పెద్దపెద్ద నగరాలకి తాపీపనికీ, కళాసీపనికీ వెళిపోయేరు ఊరొదిలీసి! మధ్యతరగతి పిల్లలం- సగం సగం చదువులు చదివి, ఉద్యోగాలు రాకా, కూలిపన్లు చేయలేకా- యిదిగో ఊరిల పెళ్లి కాని యువకుల్లాగ ఉండిపోయేం..." చెప్పాడు యువకుడు.

"... భలేగా మాట్లాడ్తావోయ్..." ప్రశ్నించేరు ఫీల్డాఫీసర్.

ఈలోగా- ఓ రైతు, ఫీల్డాఫీసర్‌కి నమస్కరించి-

"బావూ, లోన్ తీర్సిస్తే- మళ్లా, యిస్తావా? అనడిగేడు.

"... యేం? ఇవ్వకపోతే- చెల్లించవా?" కోపగించేరు ఫీల్డాఫీసర్

"... అదేమ్మాట? తీర్సకపోతే వల్లకుంతాదేటి బ్యాంకు? నోటీసులిచ్చేదా? కోరుట్ల కేసు వేసేదా? ఇళ్ల ముందర గోల గోల చెయ్యవా మీ జీవులు? సెప్పుబావూ- వల్లగుంతాదేటి బ్యాంక్?" ప్రశ్నించాడు రైతు.

ఈ జనం అంతా- ప్రశ్నార్థకాల్తో మాట్లాడ్తారెందుకని...? ఫీల్డాఫీసర్‌కి, జవాబు దొరకని ప్రశ్న?

రైతు వేపు, చిర్నవ్వుతో చూస్తూ- తనూ ప్రశ్నార్థకంగా మాట్లాడబోతూ-

"... బ్యాంక్ యెందుకుంది? ఋణాలివ్వడానికి కాదా?" అనన్నాడు.

"...యేఁవో! మీరు మళ్లా యిస్తే ఫరవాలేదు. శనోరంనాడు వొంటిపూట బేంకు- అవదనీ; సోమవోరం బిజీ అనీ, మంగ్లోరం- ట్రెయినింగని, బుధవోరం- బేంకీ రోజుకాదనీ- యిలాగ తిప్పేసినారనుకోండి- నా బతుకు కల్లమైపోతాది! ప్రైవేట్ అప్పుచేసి- మీకు చెల్లిస్తాను. ఆ ప్రెయివేటోడు- వారపు వడ్డీ లాగేస్తాడు. మీ బ్యాంకిచ్చిన వడ్డీ రాయితీ- ఆడి గుండంలోన కల్సిపోద్ది! అవతల ఆడివడ్డీ, యివతల మీ వడ్డీ- గూబ గుయ్యిఁవనిపోద్ది నాకు..." అని వివరణ యిచ్చుకున్నాడు రైతు.

"... మరి, యిన్ని లెఖవేసేవాళ్లు- ప్రైవేట్ అప్పులెందుకయ్యా వాడతారు? పంటల మదుపుకి- మేం లోన్సిస్తున్నాంకదా?"

ఇలాంటి ప్రశ్నలే, యింట్లో తన పన్నెండేళ్ల కొడుకువేస్తే యెలా చూసాడో, అలా, ఫీల్డాఫీసర్‌వేపు ఆ రైతు చూసి-

"... పంటల మదుపుకి మీరిస్తారు! మరి, యింటి మదుపుకో?" అని, ప్రశ్నార్థక జవాబు చెప్పాడు.

గతుక్కుమన్నాడు ఫీల్డాఫీసర్! ఔనుగదా! స్కేల్ ఆఫ్ ఫైనాన్స్- ఒన్లీ క్రాపింగ్ నీడ్స్ లెక్కించే నిర్ణయిస్తాం!

"... యేదో వేడినీళ్లకు చన్నీళ్లన్నట్టు... బేంక్‌లోన్!" అని నవ్వి- ఫీల్డాఫీసర్ దగ్గర, మళ్లీ ఋణానికి హామీ తీసుకొని, చెల్లింపుకోసం కౌంటర్‌వేపు నడిచేడు రైతు!

ఫీల్డాఫీసర్ యెదుట- మొదటి ప్రశ్నలా ఆ యువకుడు నిల్చునే వున్నాడు. సానుభూతి కలిగింది ఫీల్డాఫీసర్‌కీ. అంతలోనే- యీ సబ్సిడీ

పథకాల ఋణాలేవీ- సక్సెస్ కాకపోవటం, లోన్స్ రికవరీ గూడా సక్రమంగా లేకపోవటం గుర్తొచ్చి-

"... ప్చ్. ఈ స్కీమ్స్- మంచి ఆలోచనతో ప్రవేశపెట్టినా- ఇంప్లిమెంటేషన్‌లో ఫెయిలవుతున్నాయయ్యా! మా బ్యాంకులకైతే- యీ స్కీమ్స్ కిచ్చిన లోన్స్ డిఫాల్డయిపోయేయి..." కంఠంలో నైరాశ్యం పలికింది.

యువకుడు- మౌనంగా తలాడించేడు.

ఈ పథకం క్రింద ఋణం కోసం- దరఖాస్తు దగ్గర నుంచీ- సర్టిఫికేట్ల ఎటెస్టేషను, కులసర్టిఫికేట్ సంపాదన, ప్రాజెక్ట్ రిపోర్ట్ తయారీ, ఇంటర్వ్యూ హాజరు, కార్యాలయాలచుట్టూ తిరుగుట- నాయకుల సిఫార్స్, ఉద్యోగుల చేతుల్ని తడుపుట- చివరికి, ఎంపికలిస్ట్ రావటం, బ్యాంక్ ఋణమివ్వటం! ఈ తంతంతా కదలాడింది మనసులో యువకుడికి...

"... యీ తంతులో ఫెయిల్యూర్ వుందనుకుంటారందరూ. నిజానికలా కన్పించుతుంది గూడా. గానీ, యీ స్కీమ్స్ ఆలోచనలోనే ఫెయిల్యూర్ వుంది. ఆలోచించే అధికార్లు యెవరు? వారి అవగాహన ప్రకారం- యువశక్తి అంటే యేమిటి? యువశక్తి కోసం వారు తయారుచేసే పథకాలేమిటి? -యీ ప్రశ్నలు వేసుకొని ఆలోచించండి! అపుడర్థమవుతుంది- ఫెయిల్యూర్‌కి బీజాలెక్కడున్నాయో!

ఒక దేశానికి సమగ్ర ఉత్పత్తి శక్తిని- నిరంతరం అందించే శక్తిగా- యువశక్తి వుండాలి! అందుకు తగ్గ పథకాలు ఆలోచించాలి! ఆటోరిక్షాలకీ, కిరాణా, పాన్ షాపులకీ, ఇటిక బట్టీలకీ, ఇనపకొట్లకీ- సబ్సిడీ ఋణాలిస్తే- దేశ యువశక్తి పెరుగుతుందా? యువకుల్లో- అపారమయిన శక్తి వుంటుంది, దానికి సబ్సిడీ అఖర్లేదు. శక్తిని బలహీనపర్చే పథకంతో- యిలాంటి స్కీమ్స్ పెట్టేరు..." దాదాపు యిటువంటి మాటలే, మరికొన్ని చెప్పి, యెప్పుడూ పలికే మంత్రం వర్గవ్యవస్థ పోవాలి, అందుకు, నిలబడాలి యువకులు, అన్న-అజయ్‌గారి మాటలు గుర్తుచ్చేయి యువకుడికి. అజయ్ గారికి, దగ్గర దగ్గర అరవైయేళ్లుంటాయి. యుక్తవయసునుంచీ- యీ వర్గవ్యవస్థ మార్పుకోసమే కృషి చేస్తున్నాడట...!

అసంకల్పితంగా నవ్వొచ్చింది యువకుడికి. అజయ్‌గారి మాటలకి, ఆరోజు తనతండ్రి వొక దీర్ఘ నిట్టూర్పు విడిచేడు. తొలినాళ్లలో జరిపిన కూలిరేట్ల పోరాటాలు, భూమికోసం పోరాటాలు, కేసులూ, జైళ్లూ తండ్రి గుర్తుజేసాడు! చేసి-


*చేతివృత్తుల యువకులొక గ్రూపు, రైతాంగ యువకులొక గ్రూపూ, చిన్నతరహా వ్యాపారులొక గ్రూపూ- అవుదాం అనుకున్నారు. గ్రామాని కవసరమైన, గ్రామసంబంధ ఉపాధి పథకాల ప్రాజెక్టులు తయారుచేసి, దరకాస్తులిచ్చేరు!....*


"... మా తరం గడిచిపోయింది. కూలిరేట్ల పోరాటాలకిపుడు కూలిపనే దొరకటంలేదు. భూపోరాటమంటామా- దున్నుకోండి, భూవులిచ్చేస్తామని, రైతులే అంటున్నారు. కూలీలు వలసలు పోయి, రైతులు భూములమ్మేసి, మేదరి, గీదరి, సాలీలు, షరాబులు వృత్తులొదిలేసి, ఊరు ఖాళీ అయిపోయింది. కామ్రే! యువతరమెక్కడుంది? ఎలాగ నిలబడతాది?" అన్నాడు. ఆ యువకునికదంతా గుర్తొచ్చింది! నిజమేగదా! ఎవరు? ఎందుకు? ఎలా? -నిలబడటమ్మీద ప్రశ్నలు కలిగేయి...

"... దేనికోసం దరకాస్తు చేసావోయ్?" అడిగేరు ఫీల్డాఫీసరు.

"... మార్పుకోసం..." అసంకల్పితంగా, జవాబిచ్చేడు యువకుడు. అతనింకా, అజయ్ మాటలూ, తండ్రి చెప్పిన ఉద్యమ చరిత్రా... గ్రామంలో మార్పులలోనే... తండ్రి కాలంనాటి ఉద్యమాలన్నీ- చారిత్రక జ్ఞాపకాలుగానే వున్నాయి తప్పా- అంతకుమించి తనని కదపటంలేదు. అజయ్‌గారు పాతకాలపు వైద్యునిలా కన్పిస్తున్నాడు. పథకాల రోడ్లూ, రేషన్‌కార్డులూ, ఫించన్లూ, సబ్సిడీ ఋణాలూ వగైరాలను- నిత్యావసర సరకుల దుకాణంలా నడుపు తున్నట్టు ప్రభుత్వం కన్పిస్తోంది. అంతా అయోమయం! గందరగోళం! ఏదో చెయ్యాలి...! చెయ్యాలి...

"... ఏం మార్పయ్యా? వాడ్డుయూ మీన్?" అని ఆంగ్లంలో గూడా ప్రశ్నించేరు ఫీల్డాఫీసర్. ఆ యువకుని ఆలోచనలు తెగినయి.

ఫీల్డాఫీసర్ ఆ యువకుని మళ్లీ ప్రశ్నించేడు. యువకుడు జవాబు చెప్పబోతుండగా, ఆ ఊరి సర్పంచ్ వొచ్చేడు. కంకణం చేత్తో, ఫీల్డాఫీసర్‌కి నమస్కరించి, అదేచేత్తో, ఆ యువకుని భుజం తట్టి, నవ్వే కళ్లతో-

"మా ఊరి యువశక్తి..." అని ఫీల్డాఫీసర్‌కి, పరిచయం చేస్తున్నట్లు చెప్పేడు. ఫీల్డాఫీసర్‌గారు తెలుసనన్నట్లు నవ్వేరు.

"...కుర్రాడు- యీ కాలపు కుర్రాడు కాద్సార్, ఫీల్డాఫీసర్‌గారూ..." అని, ఆ యువకుని గురించి, చెప్పేరు సర్పంచ్‌గారు.

ఫీల్డాఫీసర్‌గారు- ఆ యువకుణ్ణి మళ్లీ చూసేరు. ఆ యువకుడు మాట్లాడిన మాటలు గుర్తుకు తెచ్చుకున్నారు- ఔనౌను, యీ కాలపు కుర్రకారులా లేడు- అనుకున్నారు.

"... నేనేమన్నానంటే- యే పాన్ షాపుకో, స్టేషనరీకో, సప్లయిర్స్‌కో, దరఖాస్తెట్టుకో అన్నాను. స్వయం ఉపాధి చూసుకో అన్నాను. సెట్‌శ్రీ ఆఫీసులో సెలక్ట్ చెయ్యిస్తాను. ఫీల్డాఫీసర్‌గారు మంచోళ్లు, నా మాట కాదన్రు, చెప్తానన్నాను..." అని ఆగేరు సర్పంచ్.

ఫీల్డాఫీసర్‌గారు ప్రశ్నార్థకంగా యువకుని చూసేరు.

"... స్వయంఉపాధి వెతుకులాట అనండీ, వే అనండీ; అది జంతు లక్షణం..." అన్నాడు యువకుడు. ఫీల్డాఫీసర్‌గారు ఆశ్చర్యపోయేరు.

గానీ, ఆ యువకుడు, దరఖాస్తు చేసినరోజు నాటి రాత్రి, గ్రామంలో, తన సహయువకుల్తో జరిపిన, సమాలోచనల్లో వున్నాడు...

ఎవరికి వారు ఉపాధి పథకాలు వెదుక్కోవటం, విఫలమైతే ఒంటరిగా బాధపడటంకంటే తమ తమ శక్తి సామర్థ్యాలూ, ఆసక్తులూ గుర్తించి, గ్రూపులుగా ఉపాధి వెదుక్కోవటంలో సమిష్టిశక్తి వుందనీ, విజయమవుతుందనీ భావించేరు. అయితే- యేం చేద్దాం?

చేతివృత్తుల యువకులొక గ్రూపు, రైతాంగ యువకులొక గ్రూపూ, చిన్నతరహా వ్యాపారులొక గ్రూపూ- అవుదాం అనుకున్నారు. గ్రామాని కవసరమైన, గ్రామసంబంధ ఉపాధి పథకాల ప్రాజెక్టులు తయారుచేసి, దరకాస్తులిచ్చేరు!....

"... తప్పుచేసామా సార్?" ప్రశ్నించాడు యువకుడు.

ఫీల్డాఫీసర్‌గారేమీ బదులు చెప్పలేదు. గానీ, సర్పంచ్ అందుకొని-

"... ఎద్దు ఎండకీ, ఎనుబోతు నీడకీ లాగుతాయి, అన్నట్టు వొకడటూ, మరొకడిటూ అంటార్సార్, గ్రూపయితే..."

"... ఎద్దుల్నీ, ఎనుబోతుల్నీ కలిపి గ్రూపుజేస్తే, అలాగే లాగుతాయి. ఎద్దుకెద్దూ, ఎనుబోతులకెనుబోతులూ గ్రూపైతే సమస్యలేదు గదా..." సర్పంచ్ వాదనని, ఓడించాడు యువకుడు.

సర్పంచ్, మరి వాదించలేక, అప్పటికే గ్రామంలో, వాదనలన్నీ చేసి, ఓడిపోయేడు గనక- "... యీ కాలం కుర్రాడు కాదు. ఏంవిటో, ఊరంతటికీ పనికొస్తా దంటాడు! సాయం చేద్దురూ..." అని, ఫీల్డాఫీసర్‌ని బ్రతిమాలినట్టు, ఫీలింగిచ్చేరు సర్పంచ్‌గారు.

"... చూద్దాం, లిస్ట్ రానీయండి..."

"...ఔనంతేగదా! సెలక్షన్ లిస్ట్‌లో వుంటేనా- వీళ్లకి శాంక్షన్ చేస్తారు. లేకపోతే చేస్తారేటి?" సర్పంచ్. అడ్డంగా తలూపేరు ఫీల్డాఫీసర్.

"... చెయ్యలేరు. అదే మాటన్నాను. సెలక్షన్ గాకపోతే కుర్రోళ్లందరూ- గాలికి తిరుగుతారర్రా! వొద్దన్నాను. కొందరికేనా ఉపాధి అవుద్ది- ఇండివిద్యుయల్‌గా దరఖాస్తులిచ్చుకోర్రా- అన్నాను. యిన్లేదు!

ఈ కుర్రాడేకాదు, మా ఊరి కుర్రోళ్లంతా, యింతే! ఈ కాలపు కుర్రాళ్లు కారు..." అని బాధపడ్డాడు సర్పంచ్.

ఫీల్డాఫీసర్- దవడలు చప్పరించేరు. అప్పుడు-

"... ఒకేళ, సెలక్షన్ లిస్ట్‌లో మీ గ్రూపులుగానీ లేకపోతే, యేటిజేస్తార్రా కుర్రోళ్లో- అనడిగేను సార్! అడిగితే- యేఁవన్నారో తెల్సా సార్...? అని ప్రశ్నించి, ఆగేరు సర్పంచ్.

ప్రశ్నార్థకంగా చూసేరు ఫీల్డాఫీసర్-

"... బేంకీని కొల్లగొట్టి, మా ప్రాజెక్టులు నడుపుతాం. ఊరికోసం, మాకోసం- ఆ పని చేస్తాం! కొల్లగొట్టిన సొమ్ముని అణా పైసల్తో ఆ తరాత జమచేస్తాం, అన్నారనుకోండి. గానీ, జేగ్రత్త సార్..." అని చెప్పి, సెలవు తీసుకొని, వెళిపోయేరు సర్పంచ్.

ఫీల్డాఫీసర్‌గారికి- యిపుడా యువకుణ్ణి చూట్టానికి ధైర్యం కలగటంలేదు. ఏం చెప్పటమో గూడా తోచటంలేదు.

అంతలో, మెసెంజరొచ్చి, ఒక కవర్ ఫీల్డాఫీసర్‌కి యిస్తూ-

"రాజీవ్ యువశక్తి శాంక్షన్ లిస్ట్ వొచ్చింది సార్..." అన్నాడు.

కవర్ విప్పటానికి భయపడుతున్నాడు ఫీల్డాఫీసర్. ఆ యువకుడు- నిలువెత్తు ప్రశ్నలా...!